సాక్షి సూర్యాపేట

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025

I



చెర్వుగట్టు జాతరకు వేళాయె

నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు పార్వతీ జడలరామలింగేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. - IIలో



వ్యతిరేకంగా మాట్లాడలేదు

ఏ వర్గానికీ వ్యతిరేకంగా మాట్లాడకున్నా తనపై ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. - IIలో



రేపటి నుంచి అధ్యయనోత్సవాలు

యాదగిరిగుట్టలోని శ్రీపూర్వగిరి (పాతగుట్ట) ఆలయ అధ్యయనోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. - IIలో

న్యూస్‌రీల్

జాతరకు రావాలని సీఎంకు ఆహ్వానం



ముఖ్యమంత్రిని కలిసి జాతరకు రావాలని ఆహ్వానిస్తున్న పటేల్ రమేష్ రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : ఈనెల 16వ తేదీ నుంచి ఐదు రోజులపాటు జరిగే పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి ఆహ్వానించారు. శనివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. జాతరకు రూ.5 కోట్ల నిధులను విడుదల చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

రోగులకు సకాలంలో వైద్యం అందించాలి

మునగాల: రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం సూచించారు. శనివారం మునగాల మండలం రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. తొలుత పీహెచ్‌సీలోని పలు రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి భాస్కర్ రాజు, ల్యాబ్ టెక్నీషియన్ ఫణీందర్, శాంతయ్య పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

చివ్వెంల(సూర్యాపేట) : ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూర్యాపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి సూచించారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా జైలుకు వచ్చిన నూతన ఖైదీలతో మాట్లాడారు. న్యాయవాదులను పెట్టుకోలేని స్థితిలో ఉన్న ఖైదీలు జిల్లా న్యాయసేవాధికార కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లయితే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ సుధాకర్ రెడ్డి, డిఫెన్స్ కౌన్సిల్స్ బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, పెండెం వాణి, న్యాయవాదులు సందీప్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రజావాణి రద్దు

భానుపురి (సూర్యాపేట) : వరంగల్– ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ఫిబ్రవరి 3న నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి సోమవారం ఫిర్యాదులు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడంలేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నిక పూర్తయిన తర్వాత యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

భానుపురి (సూర్యాపేట) : దివ్యాంగులకు ఆర్థిక ప్రోత్సాహక పథకం కింద బ్యాంక్ లింకేజీ లేకుండా నేరుగా రూ.50వేల రాయితీతో జిల్లాకు మంజూరైన 24 యూనిట్లకు దరఖాస్తు గడువును పొడిగించినట్లు జిల్లా సంక్షేమాధికారి కె.నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఫిబ్రవరి 12వతేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం కలెక్టరేట్‌లోని సంక్షేమ అధికారి కార్యాలయంలో పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

98.12శాతం మంది హాజరు

సూర్యాపేటటౌన్ : ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శనివారం ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించారు. మొత్తం 7,504 మంది విద్యార్థులకు గాను 7,363 మంది హాజరు కాగా 141 మంది గైర్హాజరైనట్టు డీఐఈఓ భాను నాయక్ తెలిపారు. మొత్తం 98.12శాతం మంది విద్యార్థులు పరీక్ష రాసినట్టు చెప్పారు.


మధ్య తరగతికి ఊరట

- రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు
- 7వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 5.30 లక్షల మంది వేతనేతర జీవులకు మేలు
- వ్యవసాయ రంగానికి ప్రోత్సాహంతో 2,70,853 మంది రైతులకు ప్రయోజనం
- జిల్లా కేంద్ర ఆస్పత్రిలో అందుబాటులోకి రానున్న క్యాన్సర్ టేక్‌కేర్ సెంటర్
- కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు



సూర్యాపేట : పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లా ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులకు మేలు కలగనుంది. వ్యవసాయ రంగం, ఎంఎస్ఎంఈ (మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్)ల బలోపేతానికి ప్రోత్సాహం ఊరటనిచ్చింది. ప్రభుత్వ పాఠశాలలకు ఇంటర్నెట్ సదుపాయం, మరిన్ని ఎంబీబీఎస్ సీట్లతో జిల్లాలోని విద్యార్థులకు వసతులతో పాటు మరిన్ని అవకాశాలు దక్కనున్నాయి. పప్పు దినుసుల కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు, కిసాన్ క్రెడిట్ కార్డుల రుణపరిమితి రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచడంతో జిల్లా రైతాంగానికి లబ్ధి చేకూరనుంది. అయితే కిసాన్ సమ్మాన్ నిధి నిధులను పెంచే అవకాశముందని ప్రచారం జరిగినా.. మార్పులు లేకుండా అమలు చేయడం, కొత్తవారికి అవకాశం ఇవ్వకపోవడం నిరాశ కలిగించింది. మొత్తంగా మధ్యతరగతి ప్రజలకు పెద్దపీట వేస్తూ వారి కొనుగోలు శక్తిని పెంచేలా చేయడంతో వృద్ధికి ఊపునిచ్చేలా బడ్జెట్ రూపొందించినట్లు ఆర్థిక వేత్తలు పేర్కొంటున్నారు.

జిల్లాకు క్యాన్సర్ నిర్ధారణ సెంటర్



ప్రతి జిల్లాకేంద్రంలో క్యాన్సర్ టేక్ కేర్ సెంటర్‌ను నెలకొల్పనున్నారు. దీంతో జిల్లాలో క్యాన్సర్ బారినపడుతున్న రోగులకు వేగంగా వ్యాధి నిర్ధారణ జరిగి మరణాలు తగ్గే అవకాశముంది. ప్రస్తుతం జిల్లాలో 2వేలకు పైగా క్యాన్సర్ బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా ఇప్పటివరకు హైదరాబాద్‌కు వెళితేనే వ్యాధి నిర్ధారణ జరిగే అవకాశముంది. అలాగే సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీలో ఏటా 150 మెడికల్ సీట్లు భర్తీ అవుతున్నాయి. బడ్జెట్‌లో ప్రతిపాదించిన విధంగా 75వేల సీట్లను పెంచితే ఇక్కడ మరిన్ని సీట్లు అందుబాటులోకి రానున్నాయి. తద్వారా మరికొందరు విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది.

వేతన, వేతనేతర జీవులకు మేలు



కేంద్రం బడ్జెట్‌లో వేతన, వేతనేతర జీవులకు భారీ ఊరట కల్పించింది. ఇందులో వార్షికాదాయం రూ.12.75 లక్షల వరకు ఉన్నా ఎలాంటి పన్నులు చెల్లించాల్సి అవసరం లేదని పేర్కొంది. దీంతో జిల్లాలో ఉన్న సుమారు 9వేల మంది ఉద్యోగుల్లో 7వేలకు పైగా ఉద్యోగులకు మేలు జరగనుంది. ఇక రూ.12.75లక్షల వార్షికాదాయం ఉన్న వ్యాపారాలు, ఇతర వృత్తుల్లో ఉన్న మధ్య తరగతి ప్రజలకు భారీగా లబ్ధి చేకూరనుంది. జిల్లావ్యాప్తంగా దాదాపు 5.30 లక్షల మంది పన్నుచెల్లింపు దారులకు మేలు కలగనుంది.

వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం



వ్యవసాయం, అనుబంధ రంగాలకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. స్వల్పకాలిక రుణాల కోసం కిసాన్ క్రెడిట్ కార్డుల రుణపరిమితిని రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచనుంది. దీంతో జిల్లాలోని 2,70,853 మంది రైతులు ఈ రుణాలు పొందే అవకాశం కలగనుంది. అలాగే పప్పుదినుసుల కొనుగోలు కోసం ప్రత్యేక సెంటర్లను ఏర్పాటు చేయనుండడంతో ఈ పంటలకు మద్దతు ధర దక్కనుంచి. జిల్లాలో ఈ పంటల సాగు ఏటా వెయ్యి ఎకరాలు కూడా మించడం లేదు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పప్పు దినుసుల సాగు పెరిగే అవకాశముంది.

ఎంఎస్ఎంఈలకు మరింత ఊతం..!



సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల బలోపేతానికి కరోనా అనంతరం కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రాధాన్యమిస్తోంది. ఈ క్రమంలో గతేడాది నూతన ఎంఎస్ఎంఈలు, లేదంటే వాటి విస్తరణ కోసం రూ.5కోట్ల వరకు రుణాలను ఇచ్చింది. ఈ రుణాలను మరింతగా పెంచి రూ.10 కోట్లు ఇవ్వనుంది. దీంతో ఎంఎస్ఎంఈలకు మరింత ఊతం కలగనుంది. జిల్లాలో దాదాపు 20వేల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉండగా... మరిన్ని పరిశ్రమల స్థాపనకు అవకాశం దక్కనుంది.

ఉపాధి హామీకి భరోసా



ఉపాధి హామీ పథకానికి గత ఏడాదిలాగే ఈసారి రూ.86 వేల కోట్లు కేటాయించడంతో సూర్యాపేట జిల్లాలో 2.72 లక్షల కుటుంబాలకు చెందిన 6.32 లక్షల మంది కూలీలకు పని దొరికే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ కింద చేపట్టే పనులకు నిధులు సమకూరే అవకాశం ఉంది.

పత్తి దిగుబడి పెరిగేలా..



అధిక పత్తి ఉత్పత్తి, వంగడాల అభివృద్ధికి చర్యలు చేపడతామని కేంద్రం ప్రకటించింది. జిల్లాలో దాదాపు 90వేల ఎకరాల్లో రైతులు వానాకాలంలో పత్తి పంటను సాగు చేస్తున్నారు. అధిక దిగుబడిని ఇచ్చే విత్తలనాలను అభివృద్ధి చేయడం ద్వారా జిల్లాలో పత్తి దిగుబడి పెరిగి రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు



ఇన్వెస్టింగ్ ఇన్ పీపుల్ మిషన్ కింద రాబోయే ఐదేళ్లలో దేశ వ్యాప్తంగా 50 వేల పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయబోతున్నారు. జిల్లాలో కూడా ఈ ల్యాబ్‌లు ఏర్పడితే వేలాది మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. భారత్ నెట్ ప్రాజెక్టు కింద ఇంటర్నెట్ సేవలను అమల్లోకి తేనుంది. దీంతో జిల్లాలో 182 హైస్కూళ్లు, 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. సాక్ష్యం అంగన్‌వాడీ అండ్ పోషణ్ 2.0 కింద అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తామని కేంద్రం ప్రకటించింది. దీంతో జిల్లాలోని 1,206 కేంద్రాలకు ప్రయోజనం చేకూరనుంది.

వేతన జీవులకు ప్రయోజనం



కోదాడ: ఆదాయపన్ను రేటు స్లాబ్‌లలో మార్పులు చేయడం, రూ.12 లక్షల మేర ఆదాయపన్ను మినహాయింపు ఇవ్వడం మధ్య తరగతి, వేతన ఉద్యోగులకు భారీ ఊరట కలిగించింది. వ్యవసాయరంగానికి ప్రాధాన్యం ఇవ్వడం హర్షించదగ్గ విషయం. చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి తీసుకున్న చర్యల వల్ల ఆ రంగం అభివృద్ధి చెందుతుంది. విద్యాసంస్థలు, అంగన్‌వాడీల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ కేంద్రాల వల్ల నిరుద్యోగ సమస్య తీరుతుంది. జీఎస్టీలో మార్పు చేసి ధరలు తగ్గుముఖం పట్టినప్పుడే పేదలకు మేలు కలుగుతుంది. బడ్జెట్ కేటాయింపులు వాస్తవ రూపం దాల్చితే భారత్ మూడవ ఆర్థిక వ్యవస్థగా వృద్ధి చెందుతుంది.

బదుగుల సైదులు, ఆర్థిక విశ్లేషకుడు, కోదాడ

మధ్య తరగతికి మేలు



ఈ బడ్జెట్‌ను పూర్తిగా మధ్యతరగతి, అల్ప ఆదాయ వర్గాలు, పారిశ్రామిక వర్గాలు, వ్యాపార వర్గాలను దృష్టిలో పెట్టుకొని రూపకల్పన చేసినట్లుగా ఉంది. మధ్య దిగువ తరగతి ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి తీవ్రమైన కసరత్తు చేశారు. దేశ ప్రజలందరూ బడ్జెట్‌కి ముందు ఊహించినట్లుగా ఆదాయ పన్నులో బాగా రాయితీ ఉంటుందని అనుకున్నారు. కానీ దేశ ప్రజల ఊహల్ని మించి రూ.12 లక్షల ఆదాయం వరకు షరతులతో కూడిన పన్ను మినహాయింపు ఇవ్వటం తో అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్య ద్వారా మధ్యతరగతి ఆదాయ వర్గాల కొనుగోలు శక్తి, సేవింగ్స్ బాగా పెరుగుతాయి. ఆ మేరకు పారిశ్రామిక ఉత్పత్తి కూడా గణనీయంగా పెరుగుతుంది.

– పెద్దిరెడ్డి గణేష్, బ్యాంకింగ్‌రంగ నిపుణుడు

బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్తావన లేదు



కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా కాదు తెలంగాణకు సంబంధించి కూడా ఏమీ ప్రస్తావించలేదు. విభజన హామీలను పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఎలాంటి కేటాయింపులు చేయలేదు. రూ.12 లక్షల ఆదాయం ఉన్న వారికి పన్ను ఊరట అని చెప్పి మళ్లీ రూ.4 లక్షల స్లాబ్ అంటూ మెలికపెట్టారు. పేదలు, మహిళలు, రైతులు, నిరుద్యోగుల గురించి మట్లాడే బీజేపీ వారిని పూర్తిగా వదిలేసింది. ఉద్యోగాల ఊసే లేదు. కొత్త పరిశ్రమలకు రాయితీలు లేవు. స్కిల్ డెవలప్‌మెంట్‌ను పట్టించుకోలేదు. ఉపాధి హామీలో నిధుల పెంపు లేదు. గత బడ్జెట్‌లో ఎన్ని చేశారనేది చెప్పకుండా.. ఏదో చేశామని చెప్పుకొచ్చారు.

– చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ

ఇది మధ్యతరగతి బడ్జెట్



హుజూర్‌నగర్ : ఇది మధ్యతరగతి బడ్జెట్ అని చెప్పవచ్చు. వేతన జీవుల వెతలు తీర్చే దిశలో బడ్జెట్ ప్రతిపాదనలు ఉన్నాయి. అయిన ప్పటికీ త్వరలో రానున్న నూతన ఆదాయపన్ను చట్టాన్ని అనుసరించి మాత్రమే పన్ను తగ్గింపు ప్రయోజనాలు స్పష్టమవుతాయి. కిసాన్ క్రెడిట్ రుణాల పరిమితిని పెంచడం వంటివి వ్యవసాయరంగ ప్రయోజనదాయక నిర్ణయాలు. ఇవి స్వాగతించదగినవి. ప్రతిపాదనలు వికసిత్ భారత్ లక్ష్యంగా పెట్టుకున్నా ఆ దిశలో విధానాలురూపొందించటం, అమలు చేయటం కీలకం.

– డాక్టర్ చందా అప్పారావు, అర్థశాస్త్ర సహాయ ఆచార్యులు

నేడు పెద్దగట్టులో దిష్టి పూజ



సూర్యాపేటలో దేవరపెట్టికు స్వాగతం పలుకుతున్న పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, దేవాలయ చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్

- కేసారం చేరిన దేవరపెట్టె
- నేటి అర్ధరాత్రి వరకు లింగమంతుల స్వామి ఆలయానికి.. అనంతరం గుట్టచుట్టూ బలిహరణ
- 16 నుంచి 20 వరకు జాతర

చివ్వెంల(సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్దదైన శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు జరగనుంది. ఈనేపథ్యంలో ఆదివారం దిష్టి పూజ కార్యక్రమం నిర్వహించనున్నారు. దేవతామూర్తులతో ఉన్న దేవరపెట్టెను మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం చీకటాయపాలెం నుంచి సూర్యాపేట మండలం కేసారం శనివారం రాత్రి తీసుకొచ్చారు. ఆదివారం ఇక్కడే దేవతకు బైకానులు పూజలు చేస్తారు. అనంతరం దేవరపెట్టెను గజ్జెల లాగులు, భేరీ చప్పుళ్ల మధ్య ఓలింగా.. ఓలింగా నామస్మరణతో ఊరేగింపుగా మెంతబోయిన, తండ, మట్ట వంశీయుల సమక్షంలో 9 కిమీ దూరంలోని పెద్దగట్టుకు అర్ధరాత్రి వరకు చేరుస్తారు.

బలిహరణ

15 రోజుల తర్వాత జరగనున్న లింగమంతుల స్వామి జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గాను దిష్టి పూజ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రోజునే తల్లి పిల్ల గొర్రెను స్వామి వారికి బలిస్తారు. అనంతరం భక్తులు తీసుకుచ్చిన నైవేద్యంతో రక్తంను కలిపి గుట్టచుట్టూ బలిహరణ కార్యక్రమం నిర్వహిస్తారు. బలిచ్చిన తల్లి పిల్ల గొర్రె మాసంతో సోమవారం ఆహారం వండి భక్తులకు వడ్డించనున్నారు. దీంతో దిష్టి పూజ కార్యక్రమం ముగిసినట్లుగా ప్రకటిస్తారు. అనంతరం సాయంత్రం దేవర పెట్టెను తిరిగి కేసారం గ్రామానికి తరలిస్తారు. జాతర ప్రారంభం రోజున మళ్లీ దేవరపెట్టెను పెద్దగట్టుకు ఊరేగింపుగా తీసుకువస్తారు.



దేవరపెట్టెలోని విగ్రహాలు



పెద్దగట్టు శ్రీ లింగమంతులస్వామి ఆలయం

దిష్టిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి


యాదవుల ఆరాధ్యదైవం శ్రీ లింగమంతుల స్వామి దిష్టిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెద్దగట్టు ఆలయ కమిటీ చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్ కోరారు. శనివారం ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పోలేబోయిన నరేష్, వీరబోయిన సైదులు యాదవ్, కుర్ర సైదులు, మెంతబోయిన లింగయ్య యాదవ్, మెంతబోయిన చిన్న మల్లయ్య యాదవ్, సిరపంగి సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవరపెట్టికు ఘన స్వాగతం

సూర్యాపేటటౌన్ : చీకటాయపాలెం నుంచి కేసారం గ్రామానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న దేవరపెట్టకు సూర్యాపేటలో శనివారం రాత్రి పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, పెద్దగట్టు ఆలయ కమిటీ చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్, కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం యాదవ పూజారులు డప్పు వాయిద్యాలు, భేరీల మోతలతో నృత్యాలు చేస్తూ యాత్రగా కేసారం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో యాదవ వంశస్తులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భారీ పోలీస్ బందోబస్తు

పెద్దగట్టు జాతర దిష్టి పూజ నేపథ్యంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ వి.మహేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, 11మంది ఎస్ఐలు, 100మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిసున్నట్లు పేర్కొన్నారు.



శ్రీ లింగమంతులస్వామి, ఆకు మంచమ్మ, మాణిక్యమ్మ విగ్రహాలు

పెద్దగట్టు జాతరకు రూ.5కోట్లు మంజూరు

చివ్వెంల(సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్దదైన శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరకు రూ.5కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పోలేబోయిన నర్సయ్య యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో తాగునీరు, శాశ్వత ప్రాతిపాదికన మరుగుదొడ్లు, గుట్టపైకి దారితో పాటు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత జాతరల కంటే ఈ సారి నిధులు ఎక్కువగా కేటాయించినట్లు తెలిపారు. జాతర నిర్వహణ పట్ల ప్రత్యేక చొరవ చూపించి నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రవర్తనా నియమాళిని పక్కాగా అమలు చేస్తున్నాం

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, అదనపు కలెక్టర్

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నామని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో మొత్తం 2,682 ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లు ఉన్నారని, వీరి కోసం 23 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికలకు జంబో బాక్సులు,పెద్ద బాక్సులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాస రాజు, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డి, వేణు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం అమ్మితే రూ.50వేలు జరిమానా



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

ఆత్మకూర్ ఎస్: ఆత్మకూర్(ఎస్) మండలంలోని ఏనుబాములలో మద్యం విక్రయాలను నిషేధించాలని గ్రామస్తులు నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో ఎవరు మద్యం అమ్మినా రూ.50వేలు జరిమానా విధించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు, యువజన సంఘాలు, అఖిల పక్షాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తగుళ్ల జనార్దన్ యాదవ్, కలకోట్ల సీతారాములు ,పసునూరి అంజి, కోడిమల నాగరాజు, సైదులు, పారేల్లి నవీన్, నరేష్, రాజు ,కృష్ణ పాల్గొన్నారు.

మరింత బాధ్యతతో పనిచేయాలి

సూర్యాపేటటౌన్ : ప్రమోషన్ పొందిన వారు మరింత బాధ్యతతో పనిచేయాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో పని చేస్తున్న ఆరుగురు హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా ప్రమోషన్ రావడంతో వారికి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్డర్ కాపీలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. క్రమశిక్షణతో ఉంటూ పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని ఆయన కోరారు. ప్రమోషన్ పొందిన వారిలో పి.శ్రీనివాసులు (మేళ్లచెరువు పోలీస్‌స్టేషన్), పి.మల్లయ్య (మద్దిరాల పీఎస్), జె.శ్రీనివాసు (కోదాడ రూరల్ పీఎస్), ఖయ్యూమ్ (కోదాడ ట్రాఫిక్ పీఎస్), నరేందర్ రెడ్డి (స్పెషల్ బ్రాంచ్ సూర్యాపేట), సీహెచ్. వెంకన్న (సీసీఎస్ సూర్యాపేట) ఉన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం , పోలీసు సంఘం జిల్లా అధ్యక్షుడు రామచందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

కట్టంగూర్: హైవే వెంట నడుచుకుంటూ వెళ్తున్న మహిళను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందింది. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ శివారులో శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. అయిటిపాముల గ్రామ శివారులోని చెర్వుఅన్నారం బస్టాప్ సమీపంలో గుర్తుతెలియని మహిళ (వయస్సు 45 నుంచి 50 సంవత్సరాలు) విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు హైవే వెంట నడుచుకుంటూ వెళ్తుండగా.. వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం వచ్చి ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదరు మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. వెనుక నుంచి వచ్చిన వాహనాలు మృతదేహం పైనుంచి వెళ్లడంతో శరీర భాగాలు చెల్లాచెదురై మృతదేహం గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. విషయం తెలుసుకున్న అయిటిపాముల గ్రామ పంచాయతీ కార్యదర్శి జి. అనిల్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మహిళ శరీరభాగాలను నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతురాలు ఎరుపు రంగు చీర, నీలం రంగు జాకెట్ ధరించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం. రవీందర్ తెలిపారు.

బావిలో జారిపడి వ్యక్తి మృతి


అశోక్ (ఫైల్)

చింతపల్లి: ప్రమాదవశాత్తు బావిలో జారిపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం చింతపల్లి మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఆవుల అశోక్(50) అదే గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి తోటలో కూలీగా పనిచేస్తున్నాడు. తోటలోని బావిలో గల మోటారు పనిచేయకపోవడంతో దానిని సరిచేసేందుకు అశోక్ బావిలోకి దిగుతుండగా జారి అందులో పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి అతడిని బావిలోనుంచి బయటకు తీసి 108 వాహనంలో మాల్ వెంకటేశ్వర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

గడ్డి మందు తాగి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్: బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామానికి చెందిన పల్సం గణేష్ జులాయిగా తిరుగుతూ బైక్ దొంగతనాలకు పాల్పడేవాడు. దీంతో 2012లో అతడిపై పోలీసులు సస్పెక్టెట్ షీట్ ఓపెన్ చేశారు. వారం క్రితం కూడా అతడు ఓ స్కూటీని దొంగిలించాడు. రెండురోజుల క్రితం అతడు ఎస్.లింగోటంలోని తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

వలిగొండ : మండలంలోని వేములకొండకు చెందిన పులిపలుపుల వెంకటేష్ గౌడ్ శనివారం సాయంత్రం సమయంలో తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అటుగా వెళ్తున్న గొర్ల కాపరి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే వలిగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

చెర్వుగట్టు జాతరకు వేళాయే

- 4 నుంచి 9వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు
- 5వ తేదీ తెల్లవారుజామున రామలింగేశ్వరుడి కల్యాణం
- ఏర్పాట్లు చేస్తున్న దేవాదాయశాఖ

నార్కట్‌పల్లి: తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ ఉత్సవాలకు చెర్వుగట్టు ముస్తాబవుతోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

5వ తేదీ కల్యాణం

ఈ నెల 4వ తేదీ ఉదయం ఆలయంలోని ప్రధాన మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మత్సవాలను ప్రారంభించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 5వ తేదీ తెల్లవారుజామున స్వామివారి కల్యాణం, 6వ తేదీ తెల్లవారుజామున అగ్నిగుండాలు, 7వ తేదీ తెల్లవారుజామున దోపోత్సవం, సాయంత్రం ఏకాంతసేవ, 8వ తేదీ ఉదయం రుద్రాభిషేకం, ఏకాంతసేవ, 9వ తేదీ సాయంత్రం గజవాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

కల్యాణోత్సవం టికెట్ రూ.1000

స్వామివారి కల్యాణంలో పాల్గొనాలనుకునే భక్తులకు టికెట్ ధర రూ.1000గా ఆలయ అధికారులు నిర్ణయించారు. 300 మందికి మాత్రమే టికెట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బ్రహోత్సవాల సందర్భంగా ఏడు రోజుల పాటు గట్టు పైకి వెళ్లే వాహనాలకు టోల్ నిర్వాహకులు టోల్ చార్జీలు వసూలు చేయవద్దని ఆలయ అధికారులు సూచించారు. అదే విధంగా గట్టు పైన మూడు గుండ్ల పైకి 4, 5 తేదీల్లో భక్తులు అనుమతించట్లేదని తెలిపారు.

రెండు లక్షల లడ్డూలు తయారీ

బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తుల కోసం దాదాపు రెండు లక్షల లడ్డూలు తయారీ చేయించడంతో పాటు ప్రసాదం విక్రయించేందుకు పది కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు.


గర్భగుడిలో కొలువైన రామలింగేశ్వరుడు


లడ్డూలు తయారు చేస్తున్న సిబ్బంది

నేడు నగరోత్సవం

చెర్వుగట్టు వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నగరోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలు జరుగుతున్న విషయం ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఆదివారం సాయంత్రం నల్లగొండ పట్టణంలోని రామాలయం వద్ద నగరోత్సవం ప్రారంభించి హైదరాబాద్ రోడ్డులోని వీటీ కాలనీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి


బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం ఆమె ఎస్పీ శరత్‌చంద్ర పవార్, పలువురు అధికారులతో కలసి చెర్వుగట్టును సందర్శించారు. గట్టు పైన, కింద వివిధ ప్రదేశాలతో పాటు కల్యాణ మండపం, కోనేరు, టాయిలెట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బల్క్ వాటర్ సరఫరా చేయాలని అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో తగినంత సిబ్బందిని నియమించి పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా చేయాలని సూచించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్పీ శివరాంరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ఆర్డీఓ యాణాల అశోక్‌రెడ్డి, సీఐ నాగరాజు, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వర రావు, ఎంపీడీఓ ఉమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరుణ్‌కుమార్, ఆర్ఐ తరుణ్ ఉన్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం



బ్రహ్మోత్సవాల కోసం చెర్వుగట్టు ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. నల్లగొండ ఆర్డీఓ యానాల అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి ప్రత్యేక పరిశీలనలో పనులు జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల గురించి ప్రజలకు తెలియజేయడానికి కరపత్రాలు పంచడంతో పాటు వాహనాల ద్వారా ప్రచారం చేయిస్తున్నాం. ప్రత్యేక సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం.

– సిరికొండ నవీన్‌కుమార్, ఈఓ

అగ్నిగుండాలు ప్రత్యేకం



ప్రతి నెల అమావాస్య రోజు తెలంగాణ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో చెర్వుగట్టు ఆలయానికి వస్తుంటారు. అమావ్యాస రోజు రాత్రి ఆలయ ఆవరణలో నిద్రిస్తే అనారోగ్య సమస్యలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. బ్రహ్మోత్సవాల్లో అగ్నిగుండాలు ఎంతో ప్రత్యేకం. భక్తులు అగ్నిగుండాల్లో నడవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.

– పోతులపాటి రామలింగేశ్వరశర్మ, దేవాలయ ప్రధాన అర్చకుడు

పోచంపల్లిలో ఫ్యాషన్ డిజైన్ విద్యార్థులు




రంగులద్దే విధానాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి: హైదరాబాద్‌లోని లకోటియా కాలేజ్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్స్ కాలేజీకి చెందిన 90 మంది విద్యార్థులు శనివారం పోచంపల్లిని సందర్శించారు. ఫ్యాషన్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్, ఫ్యాషన్ ఫొటోగ్రఫి డిజైనింగ్ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులు స్టడీటూర్‌లో భాగంగా కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్, టూరిజం పార్కు, చేనేత గృహాలను సందర్శించారు. కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌లో వస్త్రాలు ఎలా తయారవుతాయో ప్రత్యక్షంగా చూశారు. ఇక్కత్ అంటే ఏమిటి, అనుసరిస్తున్న డిజైన్లు, వస్త్రాల నాణ్యతను పరిశీలించి చేనేత కళాకారుల నైపుణ్యాలను కొనియాడారు. పోచంపల్లి ఇక్కత్ డిజైన్లు నేటి ఫ్యాషన్ రంగానికి, ఇంటీరియర్‌కు ఎంతో అనువుగా ఉంటాయని విద్యార్థులు కొనియాడారు. వీరికి కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్ నిర్వాహకుడు సాయిని భరత్ గైడ్ చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ మహ్మద్ అజహరుద్దీన్ ముజాహిద్, మేనేజింగ్ డైరెక్టర్ ఆఫన్ ముజాహిద్, డైరెక్టర్ గుఫ్రాన్ ముజాహిద్దీన్, సెంట్రల్ మేనేజర్ భానుప్రియ, హెచ్ఓడీ ఫ్యాషన్స్ రుక్సానా, ఫ్యాకల్టీ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

మేకలు, గొర్రెలు, పశువుల అపహరణ

- వాటిని విక్రయించగా వచ్చిన సొమ్ముతో జల్సాలు
- ఐదుగురి అరెస్ట్
- రెండు కార్లు, బైక్, రూ. 46వేల నగదు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం): జల్సాలకు అలవాటుపడి మేకలు, గొర్రెలు, పశువులను చోరీ చేస్తున్న ఐదుగురు ముఠా సభ్యులను ఆత్మకూరు(ఎం) పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి శనివారం ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్ ఆవరణలో విలేకరులకు వెల్లడించారు. జనవరి 22, 23 తేదీల్లో ఆత్మకూరు(ఎం) మండలం కూరెళ్ల గ్రామంలో పలువురి మేకలు, గొర్రెలు చోరీ గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఆత్మకూరు (ఎం) మండలం కప్రాయపల్లి వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు నల్లగొండ జిల్లా అనుముల మండలం ఇబ్రహీంపేట గ్రామానికి సంపంగి వెంకటేశం, సంపంగి వెంకన్న, మునుగోడు మండలం గూడపూర్ గ్రామానికి చెందిన వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాకు చెందిన అమ్ములూరి విజయ్‌ప్రసాద్, హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన రావుల శివ ప్రయాణిస్తున్న కారును ఆపారు. కారు వెనుక భాగంలో సీటు తొలగించబడి ఉండడంతో పాటు మేకలు, గొర్రెలు వేసిన పేడను కడిగినట్లుగా ఉంది. దీంతో పోలీసులు కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. మేకలు, గొర్రెలను చోరీ చేసి సంతల్లో అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నట్లు నిజం ఒప్పుకున్నారు. సంపంగి వెంకటేశం గతంలో మేకలను అపహరిస్తూ పట్టుబబడి చర్లపల్లి జైలుకు వెళ్లి వచ్చినట్లు ఏసీపీ తెలిపారు. వెంకటేశంకు రావుల శివతో జైలులో పరిచయం ఏర్పడిందని, వీరంతా నల్లగొండ వద్ద ఒక వెంచర్‌లో రూమ్ తీసుకుని ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారని, వీరికి సంపంగి వెంకటేష్ అక్క సంపంగి శారద, మరో యువతి కసుకుల నందిని సహకరిస్తున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. శారద, నందిని పరారీలో ఉన్నట్లు వివరించారు. నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రెండు కార్లు, రూ.46వేల నగదు, బైక్, ఒక గొర్రె పిల్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న పోలీస్ సిబ్బంది శివచారి, రవితేజ, విజయ్, శరత్, లోకేష్‌ను ఏసీపీ అభినందించి రివార్డు అందజేశారు. పరారీలో ఉన్న వారిని త్వరలో పట్టుకుంటామని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పంతంగి టోల్‌ప్లాజాలో ఘర్షణ

- ఫాస్టాగ్ విషయమై వాహనదారుడికి, టోల్‌ప్లాజా సిబ్బంది మధ్య వాగ్వాదం
- పరస్పరం దాడులు
- ఇరువురిపై కేసు నమోదు చేసిన పోలీసులు

చౌటుప్పల్ రూరల్: పంతంగి టోల్‌ప్లాజాలో శుక్రవారం రాత్రి వాహనదారుడికి, టోల్‌ప్లాజా సిబ్బంది మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం తొండల్‌వాయి గ్రామానికి చెందిన చింత శరత్‌కుమార్ హైదరాబాద్‌లోని రసూల్‌పురలోని యాక్సిస్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం స్వగ్రామానికి వెళ్లిన శరత్‌కుమార్ రాత్రి 11గంటలకు తిరిగి హైదరాబాద్‌కు కారులో బయల్దేరాడు. కారుకు ఫాస్టాగ్ లేకపోవడంతో పంతంగి టోల్‌ప్లాజా సిబ్బంది అతడిని అనుమతించలేదు. దీంతో తాను బ్యాంక్ మేనేజర్‌ను అని చెప్పడంతో ఐడీ కార్డు చూపించాలని టోల్‌ప్లాజా సిబ్బంది కోరారు. ఈ క్రమంలో సిబ్బందికి, శరత్‌కుమార్ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో శరత్‌కుమార్ కారు దిగి టోల్‌ప్లాజా క్యాబిన్‌లో ఉన్న సిబ్బందిని కొట్టడానికి వెళ్లగా.. సిబ్బంది అతడి నుంచి తప్పించుకుని టోల్‌ప్లాజా ఆఫీస్‌లోకి పరుగెత్తాడు. ఆఫీస్‌లో ఉన్నవారు విషయం తెలుసుకుని బయటకు వచ్చి శరత్‌కుమార్‌తో వాగ్వాదం చేస్తూ అతడిపై దాడి చేశారు. శరత్‌కుమార్ కూడా తిరిగి టోల్‌ప్లాజా సిబ్బందిపై దాడి చేశాడు. ఈ ఘర్షణలో శరత్‌కుమార్ తలకు గాయం కాగా.. టోల్‌ప్లాజా సిబ్బందిలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాలు పంపించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కానిస్టేబుల్ మల్లయ్యకు టోల్ అసిస్టెంట్ రాజుకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కానిస్టేబుల్ మల్లయ్య లాఠీకి పనిచెప్పి అక్కడ ఉన్న వారిని పక్కకు జరిపి గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు శరత్‌కుమార్‌పై, అదేవిధంగా టోల్‌ప్లాజా మేనేజర్ సతీష్‌యాదవ్, సిబ్బంది రత్నేష్ ప్రతాప్‌సింగ్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

దళితుల్లో ఏ వర్గానికీ వ్యతిరేకంగా మాట్లాడలేదు

- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి
- సూర్యాపేటలో వడ్లకొండ కృష్ణ కుటుంబానికి పరామర్శ


కృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వివేక్, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, మాలమహానాడు నాయకులు

సూర్యాపేటటౌన్: దళితుల్లో ఏ వర్గానికీ తాను వ్యతిరేకంగా మాట్లాడలేదని, కేవలం పబ్లిసిటీ కోసమే మంద కృష్ణ మాదిగ తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆయన శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక శక్తులను వివేక్ వెంకటస్వామి కుటుంబం పరోక్షంగా వెనకుండి నడిపించిందన్న మంద కృష్ణమాదిగ ఆరోపణలపై వివేక్ వెంకటస్వామి స్పందిస్తూ.. మాల, మాదిగలది పొలిటికల్ గొడవని, మంద కృష్ణమాదిగ వెనకాల ఏ పార్టీ ఉందో అందరికీ తెలుసని, వాళ్ళు ఆడిపిస్తున్నట్లు మందకృష్ణ మాదిగ ఆడుతున్నారని అన్నారు. ప్రజల్లో ఆదరణ లేని మంద కృష్ణమాదిగ మూడుసార్లు ఎన్నికల్లో పోటీచేస్తే డిపాజిట్ కూడా రాలేదని విమర్శించారు. తెలంగాణలో జనాభా పరంగా రెండో స్థానంలో ఉన్న మాలలను చిన్నచూపు చూస్తున్నారనే పోరాటం చేస్తున్నామే తప్ప.. ఎస్సీ రిజర్వేషన్ అడ్డుకోవడం కోసం కాదని, దీనిపై మాల సింహగర్జనలో స్పష్టంగా చెప్పామన్నారు. మాల, మాదిగలను విభజించి పాలించాలని బీజేపీ కుట్ర చేస్తోందన్నారు.

రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

సూర్యాపేటలో ఇటీవల పరువు హత్యకు గురైన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కోరారు. శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి సూర్యాపేటలోని మాల బంటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుల దురహంకార హత్యలపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి హంతకులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై జిల్లా ఎస్పీతో వివేక్ వెంకటస్వామి మాట్లాడి నిందితులను శిక్షించాలని కోరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. వడ్లకొండ కృష్ణ హత్య దారుణమని, దీనిపై నేషనల్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తల్లమళ్ళ హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు వేణు బలరాం, నాయకులు బొల్లెద్దు దశరథ, రవి, కట్ట సైదులు, కట్ట మురళి, అఖిల్, నరేందర్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీ


- 50 తులాల వెండి అపహరణ

నేరేడుచర్ల: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి విలువైన ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన నేరేడుచర్ల మున్సిపాలిటీలో శనివారం వెలుగులోకి వచ్చింది. నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల పట్టణంలోని 14వ వార్డు పరిధిలోని మహేంద్ర షోరూమ్ సమీపంలో నివాసముంటున్న వజ్రపు శ్రీనివాస్‌రావు జనవరి 29వ తేదీన ఇంటికి తాళం వేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా గురజాలలోని తన బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి శనివారం ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉండడంతో లోనికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీరువాలోని 50 తులాల వెండి, తులం బంగారం ఆభరణాలతో పాటు రూ.16వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

12 తులాల బంగారం..

కోదాడరూరల్: కోదాడ పట్టణంలో తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసి దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. మూడు రోజుల కిందట కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి 5తులాల బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన మరవకముందే శనివారం అదే కాలనీలో నివాసముంటున్న రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగి ఎంఎల్ నర్సింహారావు ఇంట్లో దొంగలు చొరబడి 12తులాల బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేశారు. నర్సింహారావు అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం 15రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. అతడు ఆస్పత్రిలోనే ఉండగా.. అతడి భార్య డబ్బుల కోసం శనివారం కోదాడకు రాగా దొంగలు తాళం పగులకొట్టి ఇంట్లో ఉన్న ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తప్పిపోయిన వృద్ధురాలు మృతి


సైదమ్మ (ఫైల్)


నాగారం: మతిస్థిమితం సరిగ్గా లేక ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వృద్ధురాలు విగతజీవిగా కనిపించింది. నాగారం మండల పరిధిలోని ఈటూరు గ్రామానికి చెందిన నంగనూరు సైదమ్మ(65)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. ఆమె జనవరి 18వ తేదీన ఇంట్లోంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల వారు హైదరాబాద్‌లో ఉంటున్న ఆమె కుమారుడు ఆంజనేయులకు సమాచారం ఇవ్వడంతో ఆయన జనవరి 21న గ్రామానికి వచ్చి ఎంత వెతికినా సైదమ్మ ఆచూకీ లభించకపోవడంతో నాగారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా శనివారం గ్రామంలోని చెరువు కట్ట సమీపంలోని చెట్లపొదల్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో గ్రామస్తులు గమనించి దగ్గరకు వెళ్లి చూడగా సైదమ్మ మృతదేహం కన్పించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి కుళ్లిపోయిన సైదమ్మ మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం చేయించారు.

సెలూన్ షాపు దగ్ధం


దగ్ధమైన సెలూన్ షాపు

యాదగిరిగుట్ట రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో సెలూన్ షాపు, బైక్ దగ్ధమయ్యాయి. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. గౌరాయపల్లి గ్రామానికి చెందిన పూదరి సిద్దులు తన పెంకుటిల్లు ముందు భాగంలో సెలూన్ షాపు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగానే తన బైక్‌ను శుక్రవారం రాత్రి కూడా అదే సెలూన్ షాపులో పార్కింగ్ చేసి నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా సెలూన్ షాపులో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన సిద్దులు, అతడి కుటుంబ సభ్యులు ఇంటి వెనుక నుంచి బయటకు వచ్చేశారు. మంటల ధాటికి సెలూన్ షాపు, అందులో పార్కింగ్ చేసిన బైక్ దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్‌తోనే షాపు, బైక్ దగ్ధమయ్యాయని సుమారు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు.

టాటా ఏస్ వాహనం బోల్తా


రోడ్డుపై పడిన పెయింటింగ్ డబ్బాలు

బీబీనగర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు పెయింటింగ్ డబ్బాల లోడ్‌తో వెళ్తున్న టాటా ఏస్ వాహనం శనివారం బోల్తా పడింది. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు అక్కడకు చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

రేపటి నుంచి అధ్యయనోత్సవాలు

- పాతగుట్టలో ఏర్పాట్లు పూర్తి


పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి (పాతగుట్ట) లక్ష్మీనరసింహస్వామి ఆలయ అధ్యయనోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నట్లు ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి శనివారం తెలిపారు. సోమవారం ఉదయం తిరుమంజనము, తొళక్కముతో అధ్యయనోత్సవాలను ప్రారంభిస్తారు. 4వ తేదీన ఉదయం పురప్పాట్ సేవ, తిరుమంజనం, దివ్య ప్రబంధ సేవ కాలం, సాయంత్రం పురప్పాట్ సేవ, దివ్య ప్రబంధ సేవాకాలం జరిపిస్తారు. 5వ తేదీన పురప్పాట్ సేవ, తిరుమంజనం, దివ్య ప్రబంధ సేవాకాలం, సాయంత్రం పురప్పాట్ సేవ, దివ్య ప్రబంధ సేవ కాలం, నమ్మాళ్వార్ పరమపదోత్సవం నిర్వహిస్తారు. 6వ తేదీ ఉదయం పురప్పాట్ సేవ, శ్రీరామానుజాచార్య తిరుమంజనం, నూత్తందాది శాత్తుమొరై నిర్వహించి అధ్యయనోత్సవాలను ముగిస్తారు.

7వ తేదీ నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు..

అదేవిధంగా 7వ తేదీ నుంచి పూర్వగిరీశుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. 7 రోజుల పాటు బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 7వ తేదీ ఉదయం 10గంటలకు స్వస్తీ వాచనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, సాయంత్రం 5గంటలకు అంకురారోపణము, మృత్సంగ్రహణంతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. 8వ తేదీన ఉదయం 10గంటలకు ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠా, మూలమంత్ర హవనం, వేద పారాయణం, సాయంత్రం 6గంటలకు భేరీ పూజ, దేవతాహ్వానం నిర్వహిస్తారు. 9వ తేదీన ఉదయం 9గంటలకు హవనం, 11.30గంటలకు సింహ వాహన అలంకార సేవ నిర్వహించి, సాయంత్రం 6గంటలకు హవనం, 7.30గంటలకు అశ్వ వాహనం అలంకార సేవలో ఎదుర్కోలు ఉత్సవాన్ని చేపడతారు. 10వ తేదీన ఉదయం 9గంటలకు హవనం, 9.30గంటలకు తిరుమంజన ఉత్సవం, 11.30గంటలకు హనుమంత వాహన అలంకార సేవ ఊరేగిస్తారు. అదేరోజు సాయంత్రం 6గంటలకు హోమం, రాత్రి 7.30గంటలకు గజవాహన సేవ, తిరు కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 11వ తేదీన ఉదయం 9గంటలకు హవనం, 11.30గంటలకు గరుఢ వాహన సేవ, సాయంత్రం రథాంగ హోమం, రాత్రి స్వామి వారి దివ్య విమాన రథోత్సవం ఆలయ తిరువీధుల్లో ఊరేగిస్తారు. 12న ఉదయం 10.30గంటలకు మహా పూర్ణాహుతి, మధ్యాహ్నం చక్రతీర్థ స్నానం, సాయంత్రం దేవతోద్వాసన, పుష్పయాగం, డోలోత్సవం జరిపిస్తారు. 13న ఉదయం అష్టోత్తర శతఘటాభిషేకం, మహదాశీర్వచనం, పండిత సన్మానంతో ఉత్సవాలను ముగిస్తారు.

మొక్కు పూజలు రద్దు

అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో భక్తులచే జరిపించే మొక్కు పూజలు 13వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ఈఓ వెల్లడించారు. 10వ తేదీన జరిగే తిరు కల్యాణ మహోత్సవంలో రూ.600 చెల్లించి భక్తులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. 11వ తేదీన రథోత్సవం సందర్భంగా రాత్రి ఆర్జిత సేవలు, అర్చనలు, భోగములు, సేవలు రద్దు చేశామన్నారు. 12వ తేదీన చక్రతీర్థం సందర్భంగా భక్తులచే జరిపించే ఆర్జిత అభిషేకం, అర్చనలు నిర్వహించబడవన్నారు. 13వ తేదీన స్వామివారి అష్టోత్తర శతఘటాభిషేకం ఉండటంతో ఆర్జిత అభిషేకాలు, అర్చనల రద్దు చేశామని, శతఘటాభిషేకంలో పాల్గొనే భక్తులు రూ.250 టిక్కెట్ కొనుగోలు చేసి అభిషేకంలో పాల్గొనవచ్చునన్నారు.